## ఎస్ ఐ గోపాల్ ను సన్మానించిన టీడీపీ నాయకులు



యాడికి, మే 11 (అనంత ప్రభ)

యాడికి పోలీస్ స్టేషన్‌కు నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన గోపాల్ ను యాడికి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, టిడిపి సీనియర్ నాయకుడు గొర్తి రుద్రమ నాయుడు తదితరులు ఎస్సై గోపాల్ కు శాలువా పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఎస్సై గోపాల్ మాట్లాడుతూ ప్రజల సహకారంతో పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలను కాపాడేందుకు కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెకానిక్ బాబు తదితర టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## గాలివాన బీభత్సం నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, అరటి తోటలు



యాడికి, మే 11 (అనంత ప్రభ)

యాడికి మండలంలోని లక్షుంపల్లె, కేశవరాయుని పేట, దైవాలమడుగు గ్రామాల్లో ఆదివారం రాత్రి వీచిన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. బలమైన గాలుల కారణంగా పలు చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగి విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా లక్షుంపల్లె గ్రామంలో గాలివాన ధాటికి అరటి తోటలు పూర్తిగా నేలకొరిగాయి. ఇప్పటికే పెట్టుబడులు పెట్టి పంటలను సాగు చేసిన రైతులు ఒక్కసారిగా జరిగిన నష్టంతో తీవ్ర ఆందోళనకు గురయ్యారు. చేతికొచ్చే సమయంలో పంట దెబ్బతినడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ సిబ్బంది ఘటన స్థలాలకు చేరుకుని మరమ్మతు పనులు చేపట్టారు. అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసి రైతులను ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

## అగాపే వృద్ధాశ్రమంలో అన్నదానం



యాడికి, మే 11 (అనంత ప్రభ)

యాడికి మండల కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలో ఉన్న అగాపే వృద్ధాశ్రమంలో చిన్నారి జాస్మిన్ 4వ పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేకంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నిట్టూరు ఖాదర్ వలీ, భీబి మనవరాలు అయిన జాస్మిన్ పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకుని ఆమె తల్లిదండ్రులు నిట్టూరు సాయి, హమీద ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టినరోజున ఆశ్రమంలోని పెద్దలకు భోజనం పెట్టడం ఎంతో ఆనందంగా ఉందని, వారి ఆశీస్సులు జాస్మిన్‌కు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నామని తెలిపారు. అనంతరం ఆశ్రమంలోని వృద్ధులు చిన్నారి జాస్మిన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించారు. అగాపే వృద్ధాశ్రమ ఫౌండర్ బత్తల ప్రసాద్ జాస్మిన్ కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు

## ఉపాధి హామీ పనులపై అధికారుల తనిఖీ



యాడికి, మే 11 (అనంత ప్రభ)

యాడికి మండలము రాయలచెరువు గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పథకం పనులను సోమవారం అధికారులు పరిశీలించారు. జలధార కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న పనుల పురోగతి, నాణ్యతను ఎంపీడీవో వీరరాజు, ఇరిగేషన్ ఏఈ శివశంకరప్ప కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పనులు చేస్తున్న ఉపాధి కూలీలతో మాట్లాడిన అధికారులు, వారికి కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. వేసవి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కూలీలు తప్పనిసరిగా మంచినీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు వినియోగించాలని సూచించారు. జలధార కార్యక్రమం ద్వారా ప్రతి నీటిబొట్టును సంరక్షించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పనులు పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా కొనసాగాలని, కూలీలకు వేతనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. అలాగే పనుల వివరాలను ప్రజలకు స్పష్టంగా తెలియజేస్తూ, ఎటువంటి అవకతవకలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఏపీవో మద్దిలేటి, టెక్నికల్ అసిస్టెంట్లు, రాయలచెరువు ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## రైతులకు విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను పంపిణీ చేసిన ధర్మవరపు బాలాజీ



ఆత్మకూరు, మే 11 (అనంత ప్రభ)

రాప్తాడు నియోజకవర్గం ఆత్మకూరు మండలం లోని వివిధ గ్రామాలకు సంబంధించిన రైతులకు సోమవారం రోజున శాసనసభ్యురాలు పరిటాల సునీతమ్మ ఆదేశాల మేరకు వడ్డిపల్లి గ్రామంలోని విద్యుత్ సబ్ స్టేషన్ నందు తెదేపా మండల ఇంచార్జ్ బాలాజీ హాజరై విద్యుత్ శాఖ అధికారులతో కలసి రైతులకు విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను పంపిణీ చేయడం జరిగింది. గోరిదిండ్ల గ్రామానికి సంబంధించిన గుటూరు శివారెడ్డి, భైరవసముద్రం రామిరెడ్డి డీకే తండా గ్రామానికి సంబంధించిన కృష్ణా నాయక్, గోవిందు ఆనంద్ తోపుదుర్తి గ్రామానికి సంబంధించిన అస్లాంభీ, లక్ష్మీదేవి, జి. ఓబుళపతి, జి రామలక్ష్మి, షేక్ వన్నూర్ సాబ్, పంపనూరు గ్రామానికి సంబంధించిన ముత్యాలక్క ఆత్మకూరు గ్రామానికి సంబంధించిన వన్నూరమ్మ వై. కొత్తపల్లి గ్రామానికి సంబంధించిన ఈ. వెంకటేశులు తదితర రైతులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల రైతులు తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రజలు పాల్గొని పంపిణీ చేయడం జరిగింది. అప్లై చేసుకున్న రైతులు ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ దగ్గర కలసి విన్నవించుకోగా వెంటనే సంబంధిత విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి ట్రాన్స్ఫార్మర్లను మంజూరు చేసి పంపిణీ చేసినందుకు రైతులు తమ సంతోషాన్ని వ్యక్తపరుస్తూ పరిటాల సునీతమ్మ కు బాలాజీ కి కృతజ్ఞతలు తెలియజేశారు.

## నేడు కమ్మూరు లో భూరీ సర్వే గ్రౌండ్ ట్రూతింగ్ కార్యక్రమం



కూడేరు, మే 11 (అనంత ప్రభ)

కమ్మూరు గ్రామ రెవెన్యూ రైతులకు నా నమ-స్కారం..

కమ్మూరు గ్రామమునకు సంబంధించి రీసర్వే మంగళ వారం 12-5-2026 తేదీన క్రింద తెలుపబడిన సర్వే నంబర్లకు సర్వే టీం హాజరు అయి సర్వే చేయుదురు. .376,377,377,378,379,380,427,429, 430,437,438 గమనిక:సర్వే నంబర్ 428 యందు సాగులో ఉండి ఆన్లైన్ నందు లేని వారు రేపు హాజరు అవ్వండి దయచేసి సర్వే నంబర్లకు గ్రౌండ్ ట్రుతింగ్ జరుగుతుంది. కావున ఈ సర్వే నంబర్లకు సంబంధించిన రైతులు వారి పొలాల వద్దకు వచ్చి హద్దులు చూపించవలసినదిగా కోరడమైనది. రైతులు అందరు పొలం వద్దకు వచ్చినప్పుడు గ్రామ సర్వే టీమ్ కు కచ్చితంగా ఈ క్రింది డాక్యుమెంట్స్ అంద చేయాలి. 1) పట్టాదారు పాసుపుస్తకాలు నకలు 2) అసైన్మెంట్ ఐ. పట్టా నకలు 3) భూమికి సంభందించి ఏవైనా రిజిస్టర్ డాక్యుమెంట్స్ నకులు 4) మీ ఫోటో (2 ఫోటోలు)5) మీ ఆధార్ కార్డు 6) మీ ఫోన్ నెంబర్ 8) ఒకవేళ మీ భూమి చుక్కలు భూమీ ఐ ఉండి గతంలో ఎన్‌ఓసి వచ్చి ఉంటే వాటి నకలు, ఎన్‌ఓసి రాకుంటే ఆర్చైవ్ కాఫీ ఈసీ (1956 నుండీ 2025) రిజిస్టర్ డాక్యుమెంట్స్ నకలు కచ్చితంగా ఇవ్వాలి. 9) ఒకవేళ పట్టాదారు మరణించిన, వారి యొక్క వారసుల పేరు మార్చడానికి మరణ ధృవీకరణ సర్టిఫికెట్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఇవ్వవలసిందిగా కోరడమైనది.

## ఘర్షణలో గాయపడిన టిడిపి నాయకులను పరామర్శించిన ఆది కృష్ణమ్మ



ఆదోని, మే 11 (అనంత ప్రభ)

ఆదోని మండలం కుప్పగల్ గ్రామంలో నీటి కుళాయి సమస్యపై టిడిపి--బిజెపి నాయకుల మధ్య చోటుచేసుకున్న ఘర్షణలో గాయపడిన టిడిపి నాయకులను కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ, కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లిన వారు గాయపడిన నాయకుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఇలాంటి ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకోవడం బాధాకరమని పేర్కొంటూ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు శాంతిభద్రతలను కాపాడే విధంగా వ్యవహరించాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు. ప్రజల సమస్యలను చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని, హింసకు తావివ్వకూడదని స్పష్టం చేశారు. అనంతరం మధు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న శేఖర్‌ను పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. శేఖర్‌కు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరుతూ ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మురళి, బైచిగేరి ఓంకార్, కళ్ళుబాయి మల్లికార్జున, రాజశేఖర్, మహదేవ, రామాంజి, భరత్, వీరేష్ పాల్గొన్నారు

## బీసీ భవన్ ఏర్పాటుకు అధికారులకు వినతి

### బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి నాయుడు



ఆదోని, మే 11 (అనంత ప్రభ)

ఈరోజు ఆదోని డివిజన్ బీసీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి నాయుడు అధ్యక్షతన సబ్ కలెక్టర్, ఎమ్మార్వో మరియు మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు. ఆదోని రెవెన్యూ డివిజన్ పరిధిలో శ్రీ మహాత్మ జ్యోతిబాపూలే భవనం (బీసీ భవన్) ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్రంలో దాదాపు 150 బీసీ కులాలు ఉండగా, ఆదోని డివిజన్ పరిధిలో సుమారు 25 ప్రధాన బీసీ కులాలకు చెందిన ప్రజలు నివసిస్తున్నారని తెలిపారు. వారికి సమావేశాలు నిర్వహించుకునేందుకు మీటింగ్ హాల్, విద్యార్థుల కోసం లైబ్రరీ, యువతకు స్ఫూర్తి కేంద్రం వంటి సౌకర్యాలు లేకపోవడం బాధాకరమన్నారు. గతంలో పలుమార్లు వినతి పత్రాలు ఇచ్చినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ భవన్ నిర్మాణానికి 50 సెంట్ల స్థలం కేటాయించి, భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని అధికారులను కోరారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవేంద్రప్ప, దేవిశెట్టి ప్రకాష్, దనాపురం శేషన్న, కత్తి హనుమంతరావు, కపటి వీరభద్ర, రామకృష్ణ, చిన్న ఈరప్ప, కత్తి ప్రసాద్, మరాఠీ వెంకటేష్, సరోదే హరీష్ తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

## లీలావతి వృద్ధాశ్రమంలో అన్నదానం




యాడికి, మే 11 (అనంత ప్రభ)

యాడికి మండలం రాయలచెరువు గ్రామంలోని లీలావతి వృద్ధాశ్రమంలో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించి నట్లు . ఆశ్రమ నిర్వాహకురాలు పరిమి కృష్ణవేణి తెలిపారు. యాడికి మండలం తూట్రాళ్లపల్లె గ్రామానికి చెందిన యలమకూరి రామాంజనేయులు, నాగేంద్రమ్మ దంపతుల మనవడు జెసి తేజ వర్ధన్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు ప్రత్యేకంగా రాత్రి భోజన విందు ఏర్పాటు చేసి సేవాభావాన్ని చాటుకున్నారు. ఆశ్రమ నిర్వాహకురాలు పరిమి కృష్ణవేణి మాట్లాడుతూ జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. వృద్ధాశ్రమంలోని వృద్ధులను ఆదరిస్తూ అన్నదానం నిర్వహించిన యలమకూరి కుటుంబ సభ్యులకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## షార్ట్ సర్క్యూట్ బాధితులకు న్యాయం చేయాలి



యాడికి, మే 11 (అనంత ప్రభ)

యాడికి మండల కేంద్రంలోని అంకాలమ్మ వీధిలో ఆదివారం జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఘటనలో నష్టపోయిన బాధిత కుటుంబాలను ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పాతకుట్ల బాలు మాదిగ మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తక్షణ సహాయం అందించి న్యాయం చేయాలని మండల అధికారులను కోరారు. రెండు మూడు రోజులలో అధికారులు స్పందించి బాధితులకు సహాయం అందించకపోతే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బాధితులతో కలిసి అంబేద్కర్ కూడలిలో ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాండు, రంగా తదితరులతో పాటు స్థానికులు పాల్గొన్నారు

## వేతన బకాయిల కోసం మాజీ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం



యాడికి, మే 11 (అనంత ప్రభ )

యాడికి సొసైటీ బ్యాంకులో అటెండర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన రాయలచెరువు గ్రామానికి చెందిన కొండప్ప అనే వ్యక్తి తనకు రావలసిన వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం యాడికి ఏడీసీసీ బ్యాంకు వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనను గమనించిన స్థానికులు వెంటనే స్పందించి అతడిని అడ్డుకుని 108 అంబులెన్స్ సహాయంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. ఈ సందర్భంగా యాడికి సొసైటీ సెక్రటరీ శేఖర్ మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన కొండప్పకు ఐదు నెలల జీతము బకాయిలుగా సుమారు రూ. 60 వేల వరకు రావాల్సి ఉందన్నారు. అందులో ఒక నెల జీతాన్ని ఈ నెల మొదటి వారంలో చెల్లించామని, మిగిలిన నాలుగు నెలల జీతాన్ని కూడా కొద్ది రోజుల్లో అందజేస్తామని కొండప్పకు చెప్పడం జరిగిందని తెలిపారు

## ఎన్రోల్మెంట్ డ్రైవ్ కార్యక్రమం



కూడేరు,మే 11 (అనంత ప్రభ)

కూడేరు మండలం ఉన్నత పాఠశాలలో సోమవారం రోజున ఎన్ ఎన్ రోల్ మెంట్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మరియు మండల విద్యాధికారి సాయి కృష్ణ పాల్గొని ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల ఇండ్ల వద్దకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో చేర్చమని అడగడం జరిగింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను మరియు నాణ్యమైన విద్యను గురించి తల్లిదండ్రులకు వివరించి ప్రైవేట్ పాఠశాలకు వెళ్తున్న ఇద్దరు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్చుకోవడం జరిగింది కార్యక్రమంలో సిఆర్పిలు రమణ శివప్రసాద్ లు ఉన్నారు. అలాగే పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ప్రతి సోమవారం 10వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక సన్నద్ధత కార్యక్రమాన్ని ఎంఈఓ సాయి కృష్ణ పరిశీలించారు.

